# సినీమా (కి) కథ

పట్టయ్య చౌదరి ఈనాడు పాండీ బజార్‌లో ఫేవ్‌మెంటు మీద పగలల్లా తిరిగి కాలక్షేపం చేస్తున్నాడూ అంటే, కథ దొరక్క తను తియ్యబోయే సినీమాకి కథ. అంటే పాండీబజార్‌లో కథలు దొరుకుతాయని అతని అభిప్రాయం కాదు. కథలకోసం వెతకడం అతని కలవాటైపోయింది. పాండీబజార్‌లో పగలంతా గడపడమూ అలవాటైపోయింది.

అతను రిక్షాలో వొచ్చి ఉడిపి హోటల్ ముందు దిగుతాడు. సుబ్బులు అతనికోసం కానట్టుగా అక్కడ కాచుకుని ఉంటాడు. చౌదరి రిక్షా దిగడంతోటే సుబ్బులు అంటాడు.

"మనకి రిక్షా ఏటండి చౌదరిగారో! కొత్తకారు తీసెయ్యండి" చౌదరంటాడు.

"కొత్త కారుకొంటే ప్రొడక్షన్‌లో తుక్కైపోతుందిరా, కథ రెడి అవనీ, రెండు పాతస్టాండర్డులు కొని పారేస్తా"

ఇద్దరూ కలసి కథల్ని గురించీ కార్లని గురించీ కబుర్లు చెప్పుకుంటూ లోపలికి వెడతారు, సుబ్బులు చౌదరితో అతి ముఖ్యమైన విషయం చర్చిస్తున్నట్టు ముఖంపెట్టి ఇది ఒక కాఫీ హోటలన్న సంగతి తనకు గుర్తు లేనట్టే లోపలికి వెడతాడు, చౌదరి : "రెండు పెసరట్లు - బాగా వేయాలి. అల్లం పచ్చిముళహా దండిగా పారెయ్యి." అని ఆర్డరిస్తాడు అలవాటైన సర్వర్‌కి. రెండో పెసరట్టు తన కోసమని తెలియనట్టుగానే కథకుల్ని గురించి అతి తన్మయత్వంలో చెపుతుంటాడు సుబ్బులు.

"సదాశ్రీ అని కొత్తరైటరండి, మనోడే - అసలు పేరు సంచుల దామోదరం. ఆడిదగ్గరుందోకత! రెండొందల రోజులెల్లాలండి ఆ పిచ్చర్ తీత్తే, మా పసందైన కతలెండి, మనం ఇచ్చినంతా పుచ్చుకుంటాడు. నోరెత్తడు."

ఈలోగా పెసరట్లొస్తాయి.

"ఏంటిది చౌదరిగారో! మా బాగుందండి, రోజూ ఇదే పనా." అంటాడు సుబ్బులు.

"ఏడిశావు తినరా," అంటాడు చౌదరి. తింటూ సుబ్బులు సంచుల దామోదరం సదాశ్రీ ఎల్లా అయ్యాడో చెపుతుంటాడు.

"మన ఆఫీసుకి రమ్మను, విందాం," అంటాడు చౌదరి.

'ఆఫీసు' కుమారి యోచనాదేవి ఇల్లు. ఇక యోచనాదేవి ఎవరంటే

విశాఖపట్టణం సముద్రతీరానికి ఎన్నోరోడ్లు ఎత్తునుంచి కిందకి దిగుతాయి. అందులో హాస్పటల్‌నించి కిందకి దిగే రోడ్డు కొసని - పది పదిహేను గుడిసెలున్నాయి. అందులో ఒక గుడిసెలో తలుపులనే పడుచు ఉండేది.

రామకృష్ణ చౌదరనే పాతికేళ్ళ యువకుడు బి.కాం. చదవడానికి నెల్లూరునుంచి అక్కడికి వచ్చాడు - గుడెసికి కాదు - విశాఖపట్నం, పాతికేళ్ళ ప్రాంతానికి - (ఆ రోజుల్లో) ఇంటర్ పాసయిన యువకుడికి, రెండు బస్ రూట్లకూ, వందయకరాల ఆస్తికీ ఏకైక వారసుడికి, ఇద్దరు బిడ్డల తండ్రికి - హాస్టల్ నియమావళికి కట్టుబడి ఉండడం

కష్టం. అంచేత అతను - ఒక చిన్న ఇల్లు ఆస్పత్రికి ఎదురుగా వున్న పేటలో అద్దెకు తీసుకున్నాడు. ఆ ఇల్లు తుడవడానికీ, కారియర్ తోమి రెండుపూట్లా హోటల్‌నించి భోజనం తేవడానికి తలుపులుని కుదిర్చాడు. తలుపులు, పెద్దతట్టలో ఆస్పత్రికొచ్చిన రోగుల బంధువులకు భోజనాలు తెచ్చిపెడుతుండేది. అయితే చౌదరి దగ్గర కుదిరిన తరవాత, ఆమె తక్కిన బేరాలు వదులుకోవలసి వచ్చింది. ఎందుకంటే, చౌదరికి పాలు తేవాలి, అతనికీ, అతని స్నేహితులకీ, కాఫీలు కాచి ఇయ్యాలి. అతనికి రెండుపూట్లా వేడినీళ్లు కాచివ్వాలి, స్నానానికి, ఈ పనులన్నీ అయ్యేసరికి మిగతా బేరాలకు వ్యవధి చిక్కేది కాదు, అదీగాక ఆ మొత్తానికి రెట్టింపు చౌదరివల్ల ముట్టేది.

ఆ తలుపులే కుమారి యోచనాదేవి, ఆ చౌదరీ మన సినిమా ప్రొడ్యూసర్ చౌదరి. తలుపులు కుమారి యోచనాదేవి ఎల్లాగైదంటా-

చౌదరి - తండ్రి చనిపోయిన పదకొండవరోజుని - బస్సు రూట్లమ్మేసి, సొమ్ముతో, తలుపులమ్మతో, మద్రాసు సెంట్రల్లో దిగాడు - ఎయిర్ కండిషన్ పెట్టిలోంచి. పక్కనున్న మూడో తరగతి పెట్టిలోంచి సన్నాసి దిగాడు, సన్నాసంటే తలుపులమ్మకి పూర్వాశ్రమంలో మేనమామా, తాళికట్టిన మొగుడున్నూ, అంటే విశాఖపట్నం రోజుల్లో - అంటే తలుపులమ్మ తలుపులమ్మగా ఉన్నపుడు - అంటే, చీరా బొడ్డుకిందకి, తొడల పైకి విరిచి వెనక్కి దోపి రవికైనా ఎరక్క, నెత్తిమీద చుట్టకుదురు పెట్టుకొని, దానిమీద డజను భోజనాల క్యారియర్ల తట్ట లెక్కలేకండా మోసిన రోజుల్లో, ఆ రోజుల్లో తన స్తన జఘన సౌభాగ్యం, ఊరు సంపద కాలేజీ కుర్రాళ్లని, అల్లరిపెట్టిస్తున్నాయన్న సంగతి, తలుపులమ్మకీ తెలియదు. వాటికి పదిరూపాయల విలవ ఉందని, ఒకనాడు చౌదరి ఆమెకు రుజువు చేసాడు. ఆ జ్ఞానోదయం అయిన తరవాత తలుపు లెన్నో విషయాలు గ్రహించింది. అంత విలువైన విషయాన్ని కాస్త మరుగుపరిస్తే వాటి విలువ మరింత పెరుగుతుందని ఆమె అనుభవంవల్ల తెలుసుకొంది. చీర తొడలపైకి విరిచి కట్టడం మానేసింది. పిటపిటలాడే రైక తొడగడం అలవాటు చేసుకుంది. క్రమంగా మరో విషయం ఆమెకు తెలిసొచ్చింది. పిప్పరమెంట్లకీ మంచి పసందైన కాగితాలు చుడితే వాటిధర పెరుగుతుంది. అల్లాగే తన అవయవాలని మంచి మిలమిల మెరిసే నైలాన్‌తో పొదిగినట్లైతే వాటికి మంచి వెల దొరుకుతుంది.

మరో ముఖ్యమైన విషయం, ఆమె చౌదరితో పరిచయం ఏర్పడ్డాక గ్రహించింది. బెంగాల్ క్షామ నివారణకి సహాయార్థం చౌదరి ఒక నాటకం ఆడించాడు. అందులో నాయికా పాత్ర ధరించడానికి రాజమండ్రి నుంచి రాఘవకుమారి అనే అమ్మాయి వచ్చింది. రిహార్సల్సు చౌదరి ఇంట్లోనే జరిగేవి. రిహార్సల్సు అయిపోయినా, రాఘవకుమారి ఉండడానికి వేరే హోటల్ గది ఒకటి ఏర్పాటయినా, ఇంచు మించు అన్ని రాత్రులూ ఆవిడ చౌదరి ఇంట్లోనే గడిపింది. ఆవిడ చౌదరిని, "బావగారు" అని అతి ముద్దుగా మూతి సన్నగా పెట్టి పిలిచేది నాటకం అయిపోయాక రాఘవకుమారి పర్సు బరువెక్కి ఆమె రాజమండ్రి వెళ్లిపోయాక, తలుపులు చాలా ఆలోచించింది. తనెప్పుడూ చౌదరిని, "ఏటిబాబూ." అంటుంది. బావగారూ పిలుపులో నాజూకుంది. అంచేతే అన్నీ వాడిపోయిన రాఘవ కుమారికి, తనకన్న విలువ ఎక్కువ. అంచేత ఒకరోజు సాయంత్రం హోటల్నించి

క్యారియర్ తెచ్చి విస్తట్లో వడ్డించి, స్నేహితులతో పేకాడుతున్న చౌదరి నుద్దేశించి "అన్నం" ఒడ్డించేసినాను, యెల్లిపోయొచ్చేయండి బావగోరూ అంది, చౌదరి పేకాట మరిచిపోయి, కళ్లప్పగించి ఆమెవంక చూశాడు.

ఆ తరవాత కొద్ది రోజులు ఆమె తూర్పుయాస పోగొట్టడానికి కొన్ని రాత్రులు తంటాలు పడ్డాడు చౌదరి, ఆ తరవాత 'నటీమణిసవాలు' అన్న నాటకంలో నాయికాపాత్ర ధరించింది. అందులో చదువుకున్న స్త్రీ నాటక రంగంలో ప్రవేశించి, దాన్ని ఉద్ధరించడానికి ప్రయత్నించి తను పతనమైపోతుంది. ఆ పాత్ర తాలూకు భాష అంత వంటపట్టకపోయినా, కేవలం తన శరీర సౌష్టవంవల్ల నెగ్గుకొచ్చేసింది తలుపులూ. తరవాత ఇంక తెరమీద కెక్కడం ఒక్కటే ఆమెకు మిగిలిన ఆశయం. అందుకనే చౌదరితో కూడా మద్రాసులో దిగింది.

మద్రాసుతో దిగిన తరవాత సన్నాసి కేవలం ఆమె "మామ మాత్రమే." చౌదరి బావగారు.

చౌదరి దిగాడోలేదో సుందరం అతన్ని పట్టాడు. సుందరానికి వేటకుక్క లక్షణాలు ఎన్నో ఉన్నాయి. ఆంధ్రదేశంనించి, సినిమా తీసే అభిప్రాయంతో మద్రాసు ఎవరు వచ్చినా, తను, వాళ్లు రాకముందే పసిగట్టేస్తాడు.

మద్రాస్ నగరంలో ఉన్న కార్లలో మూడోవంతు మీద సుందరానికి హక్కులున్నాయి. వినాయక చెట్టియార్ ఊరెళ్లాడనుకొండి, సైకిలుమీద వాళ్ల ఇంటికి వెడతాడు. వాళ్లబ్బాయి చిన్నప్ప చెట్టితో టిఫిన్ ఆరగిస్తాడు, ఆరగిస్తూ మధ్యలో టైం చూసుకొని,

"ఆ డా డా!" స్టేషనుకి పోణుమే, ఒరు ఫ్రెండు వర్రా - తంబి, కారు శావి ఎంగి?" అంటాడు.

తంబి ఎదురు చెప్పకముందే, నౌకరుకి ఆజ్ఞ జారీచేసి, కారు తాళాలు తెప్పించుకొని, ఊపిరివదిలేలోగా కారుని భైమని, పోర్టికోలోంచి, రోడ్డుమీదికి, లాగించేస్తాడు. వినాయక చెట్టియార్ కాకపోతే దామోదర మొదలియార్. సుందరానికి కారులేని లోటుండదు.

చౌదరి సిగరెట్టు ముట్టించాడు, పోర్టర్ సామాను దింపుతున్నాడు. తలుపులు స్టేషనంతా కలయచూస్తోంది. పక్కపెట్లోంచి వచ్చిన సన్నాసి ఓలమ్మోతిదేటిది. ఇంతపెద్ద దున్నాదిటేసను. అని తన ఆశ్చర్యానంతా ఒక్క గుక్కలో ప్రకటించాడు. అప్పుడొచ్చాడు సుందరం గాలివానలా.

"హలో, హలో, హలో, ఏమండీ? ఇపుడాదానా వస్తిరి."

"ఔనండి" అన్నాడు చౌదరి. ఇతనితో ఎక్కడ, ఎపుడు పరిచయమయిందోనని కిందా మీదా పడుతూ.

"ఊర్నుండి నేరుగా వస్తిరా?"

"అంటే విశాఖపట్నంనించి, నెల్లూరులో దిగలే." అన్నాడు చౌదరి ఏ ఊళ్లో పరిచయమో తేల్చుకోడానికి.

"అదుదా," అన్నాడు సుందరం ఎటూ తేల్చకుండా. తలుపులు వేపు చూపెడుతూ చిరునవ్వునవ్వి; అమ్మగార్నికూడా తీసుకవస్తిరా." అన్నాడు.

సుందరం గ్రహించాడు ఇది సినిమా వ్యవహారమేనని. వెంటనే పోర్టర్లిద్దరితో అతి ఉత్సాహంగా అన్నాడు.

"ఎన్నడాపాక్కరింగి. సామానెల్లాం ఎడత్తి నంబర్లో వెయ్యంగ 3074. రండి. మీ హోటల్ బుక్ చేస్తిరా?"

"లేదు ఏ వుడ్ లాండ్స్ కన్నా."

"రండి మీ, మనకి ఫ్రెండ్సదా"

అసలీ ఆసామీ ఎవరో తెలియకుండానే సుందరం మొగమాటంలో పడిపోయాడు చౌదరి. వాళ్లని వుడ్లాండ్స్ కాటేజిలో దింపి, చెట్టియార్ ఇంటికి వెళ్లాడు సుందరం. చిన్నప్ప చెట్టియార్తో అన్నాడు.

"తంబీ" తెలుంగు కారన్, అప్పుడి మేపుడి చిట్టీన్." ఆ తరవాత సుందరం చౌదరిచేత ముందుగా కారు కొనిపించాడు. ఆ తరవాత ఇల్లు కుదిర్చాడు. తదుపరి సినిమా కంపెనీ పెట్టించాడు.

అప్పుడు ప్రారంభించిన చౌదరీ కథకోసం అన్వేషణ. ఈనాటివరకూ అది సాగుతూనే ఉంది.

కథ ఇంకా నిర్ణయం కాలేదుకాని, ఈ నాలుగైదు సంవత్సరాలలోనూ ఎన్నో పరిణామాలొచ్చాయి.

కథ నిర్ణయం కాకముందే - బస్సు రూట్లు అమ్మిన లక్షా యాభయివేలూ అయిపోయాయి. మిగతా ఆస్తి అమ్మడానికి వీల్లేకండా అతని మామగారు బిడ్డల తరపున దావావేసి, ఆస్తికి అతని భార్యని గార్డియన్గా పెట్టించాడు.

తలుపులమ్మ కుమారి యోచనాదేవయింది. ఇపుడు చౌదరిని ఆమే పోషిస్తోంది. అంటే రోజూ కాఫీ హోటల్ ఖర్చుకింద, సిగరెట్లకీ రెండు రూపాయలు రెడ్డియార్ చేత ఇప్పిస్తుంది.

సన్నాసి, అపుడూ ఇపుడూ మావేంగాని, అతనిపుడు రెడ్డియార్ కారుని సొంతంలా వాడుకుంటున్నాడు. టెరిలిన్ బుష్షర్టులూ, కౌబాయి ప్యాంట్లు వేస్తున్నాడు. నాటుసారా మానేసి గ్రేఫ్ బ్రాంది తాగి తాగి మనిషి సున్నితపడ్డాడు. ఈ మార్పుల కన్నిటికీ మూలకారకుడైన రెడ్డియార్ ఎవరో, ఎందుకు ఏ సందర్భంలో, ఎప్పుడు వచ్చాడో కొంచెం వివరంగా ముందు ముందు తెలుస్తుంది.

ప్రస్తుతం తలుపులమ్మ కుమారి యోచనాదేవిగా ఎల్లా మారిందో చెపుతాను.

సుందరం 'చౌదరి చిత్ర' కంపెనీకి త్యాగరాయనగర్లో ఒకపెద్ద యిల్లు అద్దెకు సంపాదించాడు. అద్దె అయిదువందలయినా, మేడమీద చౌదరీ తలుపులమ్మల నివాసానికీ, కింద ఆఫీసుకీ అనుకూలంగా ఉంది. సుందరం తనని ప్రొడక్షన్ మానేజరుగా 400 రూ. జీతంమీద తనే నియమించుకున్నాడు. హీరోకి, విలన్కి, డైరక్టరుకీ, సంగీతం డైరక్టరుకీ అడ్వాన్సు లిప్పించాడు. కవిని కుదర్చడంలో కొంచెం చిన్న అభిప్రాయ భేదాలొచ్చాయి అతనికి, సుందరం - విషశ్రీ అన్నకవి అన్ని విధాలా అనుకూలంగా ఉంటాడనీ, అతను రాసిన చిత్రం "విషనాగు" మొన్ననే శతదినోత్సవం జరుపుకుందనీ,

ఎంతో నచ్చచెప్పాడు. అయితే చౌదరికి సినిమా విషయం అనుకున్నప్పటినించీ బ్రహ్మశ్రీ చేత కథ రాయించాలని పట్టుదల.

బ్రహ్మశ్రీ 'నటిమణిసవాలు' రాసిన మహనీయుడు ప్రదర్శనలో ఎన్ని లోపాలున్నా, కేవలం రచయిత ప్రతిభవల్ల ఆ నాటకం రక్తి కట్టిందని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ మొదలు, ఆస్పత్రి చప్రాసీ వరకూ, ఏకగ్రీవంగా అన్నారు. అందుచేత చౌదరి "బ్రహ్మశ్రీ"కి రమ్మని ఉత్తరం రాస్తూ డబ్బుకూడా పంపాడు.

బ్రహ్మశ్రీ ఉత్తరం డబ్బూ అందుకున్నాడు. ఒకవారం తరవాత అతని వద్దనుంచి సమాధానం వచ్చింది.

సారాంశం ఇది:

"చౌదరి!

నాబోటి అనామకుణ్ణి సినిమా అందలం ఎక్కిద్దామని అనుకోడం స్నేహితుల ఎడల నీకున్న పక్షపాతానికి గొప్పనిదర్శనం. అయితే పిల్లా జల్లాతో ఉన్న నేను – ఏదో కడుపులో చల్లకదలకుండా కలక్టరాఫీసులో గుమాస్తా పని చేసుకుంటూ పొట్ట పోసుకుంటున్నాను. ఇది వొదిలేస్తే, మళ్లీ దీన్ని తిరిగి సంపాదించుకోలేను. నీకు బోలెడంత పిత్రార్జితం ఉందని, సినిమా కంపెనీలో కాఫీ ఖర్చుకి చాలదని వినికిడి, అదీగాక ఎందరో ప్రతిభావంతులు రంగస్థలంమీద తమ నటనా కౌశల్యాన్ని రుజువు చేసుకున్నవారు. దేశఖ్యాతి నార్జించిన రచయితలు, చిత్రకారులు, ఎన్నో ఆశలు పెట్టుకుని మద్రాసు వచ్చారని ఆఖరికి పాండీబజారు పేవ్‌మెంట్లని ఆశ్రయించుకుని, జీవచ్ఛవాల్లా బ్రతుకుతున్నారని అంటారు. కాలం కర్మం కలసిరాక నేనుకూడా ఆ మహనీయుల జాబితాలోకి ఎక్కడం నాకిష్టంలేదని నా మనవి.

పాండీ బజారులో పేవ్‌మెంట్ల నాశ్రయించుకొని, కొందరు మాజీ ప్రొడ్యూసర్లు కూడా ఉన్నారని వినికిడి. అందులో నువ్వు చేరొద్దని నా హెచ్చరిక.

సినిమా రంగాన్ని నువ్వు సాధించలేవని నాకు గట్టి నమ్మకం ఏర్పడ్డంవల్ల ఇంతగా రాయవలసి వచ్చింది. అందుకు ఒక తార్కాణం చాలు.

శ్రీమతి తలుపులమ్మ కథా నాయకి అని రాశావు. నేను వొద్దంటే నువ్వెలాగ మానవు. తలుపులమ్మది అసాధారణమైన శరీర సౌష్టవమని నేనూ ఒప్పుకుంటాను. ఆ పొంకం చూసి జనం ముగ్దులై పోతారని నీ ఆశ. మూడుకోట్ల ఆంధ్రుల్ని, నీ కళ్ళతో తలుపులమ్మని చూడమని అడగడం అసందర్భం. కథానాయకి లక్షణాల్లో పొంకంకూడా ఒకటి. అయితే అదొక్కటీ ఉంటే చాలదు. చాలమంది కథానాయికలకి అదిలేదుకూడా. అయితే ఆ లోపం కప్పిపుచ్చడానికి ఇతర సాధనాలున్నాయి. రబ్బరు, ప్లాస్టిక్, సాధనాలు, ఫలానిది అని చెప్పలేను కాని, మరొకటేదో ముఖ్యమైన లక్షణం ఉండాలి. శ్రీమతి తలుపుల్ని వెయ్యిపుటాలేసినా, ఆ లక్షణం ఆమెలోంచి పుట్టదు. అయితే నేనిదంతా తెలియని తనంలో చెపుతున్నానని, శ్రీమతి తలుపులు లోని, లోతు పాతులు నీకు తెలిసినంతగా ఇంకెవ్వరికీ, తెలియవని నువ్వనుకోవడం ఖాయం. అంచేత ఆమె కథానాయికగా ఒక చిత్రం – ప్రారంభిస్తావు. పూర్తి చేసినా చెయ్యలేకపోయినా, అంచేత ఒకటి రెండు సలహాలు,

తలుపులు పేరు బొత్తిగా తూర్పు కంపు కొడుతుంది. అంచేత పేరు మార్పించాలి. ఆవిడ అసలు పేరు తలుపులు అయ్యుంటుంది. అంచేత యోచనా దేవిగా మారిస్తే, గంభీరం గానూ, ఎవరికి అంతగా అర్థం దొరకనిదిగా గానూ ఉంటుంది. మరొక హెచ్చరిక, శ్రీమతిగా సినిమా జీవితం ప్రారంభించి నెగ్గుకొచ్చిన వాళ్లు బహుతక్కువ. అంచేత కుమారి యోచనాదేవి అని పేరు పెట్టు. శ్రీమంతుల స్నేహంచేసిన ఈమె కుమారి అంటే ఎవరు నమ్ముతారన్న సంకోచం నీకక్కర్లేదు. సూర్యుడితో అవధికి మించిన స్నేహంచేసి, కర్ణుడంతటి బిడ్డను కన్న కుంతీదేవి "కుమారి" అప్పటికి.

'మరొక ముఖ్య సలహా':-

కుమారి యోచనాదేవి అనబడే తలుపులమ్మ - లో ఇతర విధాల ప్రతిభలు ఎన్నో ఉన్నాయి. మనుషుల్ని క్షణంలో పసిగట్టగలశక్తి ఉంది. తన భాషలో అతిచమత్కారంగా మాట్లాడి, ఎంతటి మగవాళ్లనైనా, రంజింపచెయ్యగలదు. అంచేత ఆవిణ్ణి ఆ తూర్పుభాషలో, ఆ పొంకంతో, రబ్బరు బొమ్మలా ఎగిరెగిరిపడే ఆ ఉత్సాహంతో, తెరమీద కెక్కించగలిగావా! ఆమెకింక పట్టపగ్గాలుండవు. హాస్యవేషం వేయించావా, ఎంతటి హీరోయిన్నయినా, తినేస్తుంది - కుమారి యోచనాదేవి - ఇందులో నిజం నీకర్థంకాకపోయినా, ఆవిడకర్థంఅవుతుంది. చదివి వినిపించు. ఆవిడ చదవలేదు గనక-

ఇట్లు

నీ, శ్రేయోభిలాషి,

బ్రహ్మశ్రీ

తా:క: నువ్వుదయతో పంపిన రైలు ఖర్చుల డబ్బు తిరిగి పంపడంలేదు. సినిమాలోకంలో ఎందరో నీ డబ్బు తినబోతారు. అనవసరంగా, అన్యాయంగా, నేను స్నేహితుణ్ణి, తినదగినవాణ్ణి, అయినా ఈ వందరూపాయలు నీకవసరమొచ్చే పరిస్థితి వస్తే - (రాకూడదని నా ఆశ) నిర్మొహమాటంగా ఉత్తరం రాయి. తలతాకట్టు పెట్టయినా పంపిచేస్తాను.

బ్రహ్మ

ఈ ఉత్తరం చదువుకున్నాక - చౌదరిగారికి, కోపం, భయం ఉక్రోషం ఎన్నో వొచ్చాయి. అది నవ్వురూపంగా పైకొచ్చింది, "వాడెప్పుడూ ఇంతే. తలతిక్కమనిషి." అని ఏదో బహువిచిత్రమయిన కొత్త విషయం కనిపెట్టినట్టు మరింత విరగబడి నవ్వాడు.

అయితే తలుపులమ్మకి ఉత్తరంలో ఒక విషయం నచ్చింది 'ఈరోయిన్ యాసం' అంటే తలుపులమ్మకి తలా తోక లేని వ్యవహారంలా ఉంది. హోదా యేదో వస్తుందన్న వెర్రివ్యామోహం తప్ప, అందులో సరదా లేదామెకు. హాస్య పాత్రవేసి అందులో తూర్పుభాష మాట్లాడమంటే, చెరిగి పారేస్తుంది. చౌదరి దగ్గర ఈ కబురెత్తకపోయినా, ఆమె మనస్సులో ఇది ఆడుతోంది.

ఆ తరువాత సంఘటనలు కొంత గజిబిజిగా జరిగాయి, సుబ్బులు - యగస్ట్రా సప్లయిరు - తరచు రావడం చౌదరి డైరక్టరు, సుందరం వగైరా ఇవతల కథతో కుస్తీపడుతుంటే, మేడమీదకుపోయి, కుమారి యోచనా దేవితో కబుర్లు చెపుతూ కూచోడం, జరుగుతూ ఉండేది. సన్నాసికూడా ఉండెడివాడు. క్రమంగా సన్నాసి ఒక్కడే

కథలు

మిగలడం మొదలుపెట్టాడు. కుమారి యోచనాదేవికి 'యగ్రస్టా సప్లయరు'తో సమాన స్థాయినీ కూర్చుని మాట్లాడ్డం ప్రొడ్యూసరు తాలూకు మనిషి – హోదాకి తగదనిపించింది. ఆ సందర్భంలో పాండిచేరి వ్యవహారాలు చర్చించడం జరిగింది. సుబ్బులూ, సన్నాసి.

దానిఫలితంగా సన్నాసి కారుతోలడం అలవాటు చేసుకున్నాడు. రోజు పొద్దున్న 7 గంటలవేళ డ్రైవరుతో ఐలెండ్ గ్రౌండ్స్‌కి పోవడం అక్కడ కారుతోలడం నేర్చుకోడం, అతని దినచర్య, ఈ విధంగా రెండునెల్లు గడిచాక – ఒకరోజు పొద్దున్న మామూలుగా ఐ లైండ్ గ్రౌండ్స్‌కని బయలుదేరిన కారు మధ్యాహ్నానికి కాదుగదా, రాత్రికైనా రాలేదు, మర్నాడు తెల్లవారినా, కారుగాని, సన్నాసిగాని ఇంటికి తిరిగి రాలేదు.

దురదృష్టవశాత్తు ఆ రోజుని సుందరం 'విషశ్రీ'ని కూర్చోబెట్టి కథరాయించడానికి ముహూర్తం పెట్టాడు. కారులేదు గనక కవిగార్ని టాక్సీలో తీసుకొచ్చాడు సుందరం. కాఫీ, ఫలహారాలు, తమలపాకులు, తంగభస్మం, అనబడే పొగాకు, అన్నీ తృప్తితీరా సేవించి, విషశ్రీ కథ చెప్పడం ప్రారంభించాడు : అంటే కథకి ఉపోద్ఘాతం.

"పది లక్షలౌతుందండి" "ten lakhs" అన్నాడు విషశ్రీ నోట్లో ఊటని క్రింద పెదవితో పట్టి లక్ష రూపాయలు చేతపట్టుకొంటే, కలర్ పిక్చర్ తియ్యొచ్చన్న సుందరం వేపు చౌదరి బొమలు ముడివేసి చూసాడు. సుందరం ఆ చూపు గమనించి గట్టిగానే,

"అంతదా, ఆరు ఆందిరా, మైసూరు బరురుబా, తమిళ బంద్రి, బొంబాయి, కలకత్తా, ఒరిస్సా ఎల్లాంశేత్తి అంబదు వచ్చాంగ, శేతది బరురుచా, నాన్‌దాసె ఫ్లినే –" అన్నాడు.

చౌదరి సిగరెట్టు ముట్టించాడు. విషశ్రీ ఉమ్ము వేసుకొచ్చాడు.

"అణ్ణి! కతదాసెప్పండిమీ, అన్నాడు సుందరం. విషశ్రీ చెప్పడం మొదలెట్టాడు."

"ఎన్.టి.రామారావు వీధివెంట నడుస్తున్నాడు – రామారావుగారే వెయ్యాల్లెండి ఈ వేషం, (సుందరం తలూపాడు) రామారావు నడుస్తున్నాడు. దారి తరగడంలేదు. పైజమా దుమ్మైపోయింది. ఎడం కాలిజోడు తెగిపోయింది. అది రోడ్డుపక్కని పారేసి మళ్లీ నడుస్తున్నాడు. నూతిదగ్గరకొచ్చాడు, లోపలికిచూసాడు. నుయ్యి వాడకంలో లేదు. లోపల నాచు, కప్పలు, 'ఛ' అనుకున్నాడు. బయలుదేరాడు, నది వేగంగా ప్రవహిస్తోంది. అందులోకి చూశాడు. బురదకట్టు ఈదుకుంటూ వచ్చింది గట్టుకి – గుట్టంతా బురద. ఒంద్రుమట్టి – 'ఛ' అనుకున్నాడు. మళ్లీ – సముద్ర కెరటాలు ఉవ్వెత్తుగా లేచి గట్టుకి ఎగబాకుతున్నాయి – అతనికాళ్లదాకా, కాళ్లకింద ఇసక కరిగి కళ్లు తిరిగినట్లైంది, తడబడ్డాడు, చతికిలబడ్డాడు, ఎందుకంటే పగలంతా ఏమీ తినలేదుగామరి, అందుకని నీరసం. పెద్ద కెరటం వచ్చింది. నీళ్లు ఇసక కాస్త నోట్లోకి పోయాయి. ఉప్పు కషాయం" ఛ–అనుకుని ఉమ్మేసాడు మళ్లీ తడి గుడ్డలతోటే రైలు కట్టదగ్గరకొచ్చాడు. బ్రిడ్జిదిగింది రైలు, జోరుగా వాలుకి జారిపోతోంది – అరవయి మైళ్ల స్పీడు డీసెల్ ఇంజన్ కూడా, రామారావు రైలు పట్టామీద తలెట్టాడు. ఆత్మహత్యకోసమేగా బయలుదేరాడు మరి? రైలు ఒచ్చేస్తోంది – రామారావు తల తియ్యాలా. పది గజాలు – అయినా కదల్లా – గజం – ఊహూ – రామారావక్కడే ఉన్నాడు. ఇంక మెడమీంచి పోతుంది రైలు. కర్రుమంది

బ్రేకు, రైలంతా ముందికీ వెనక్కి గుంజుకుంది. బిర్రబిగిసింది బ్రేకు. శక్తి కొద్దీ పట్టాడు డ్రైవరు. మెల్లగా జారింది ఇంజన్ చక్రం. రామారావు మెడదాకా వచ్చింది. తగిలింది కూడా, కానీ ఆగిపోయింది.

ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ఊపిరి బిగబట్టుకు విన్నారు. చౌదరి గుండె రైలు ఇంజన్ లాగే కొట్టుకుంది. విషశ్రీ ఉమ్మి వేసుకోడానికి వెళ్లాడు. అపుడొచ్చాడు సుబ్బులు – మేడమీదనించి.

"చౌదరిగారూ... కొంపమునిగింది." అన్నాడు ఇదికూడా కథలో భాగంలాగే అనిపించి, చౌదరిగారు కదలలేదు.

"బావగారూ" మామః! అంటూ మేడమెట్లు మీంచి పడిపోయినంత పనిచేసింది, కుమారి యోచనాదేవి, అపుడు చౌదరి లేచివెళ్లి, ఆమె మూర్ఛవచ్చి పడిపోకుండా పట్టుకున్నారు. మేడమీదకి తీసుకుపోయారు.

మేడమీద, సుబ్బులు గజిబిజి మాటల మహారణ్యంలోంచి వెలువడ్డ కథ ఇది.

క్రితం ఉదయం ఇద్దరూ కారు తీసుకొని – పాండిచ్చేరి వెళ్లారు. సన్నాసికి సాయంకాలానికి కొంత ఎక్కువయిన మాట నిజం, అతనిదగ్గర మరి ఎలా వచ్చాయో – మూడు వేల రూపాయలున్నాయి. మూడువందల యాభై గ్రేప్ సీసాలొచ్చాయి. ఆ డబ్బుకి – మద్రాసులో అమ్మితే వెయ్యి రూపాయలొస్తాయని సుబ్బులే యథాలాపంగా అన్నాడు. సన్యాసి అంతపని చేస్తాడని సుబ్బులు – (సత్యెప్రమాణకంగా) అనుకోలేదు. అర్ధరాత్రి కారు తోలుకొస్తుంటే – పోలీసులు కారునీ, సన్నాసినీ, గ్రేప్‌బుడ్లనీ పట్టుకున్నారు. సుబ్బులుముందు జాగ్రత్తపడి కబురుచెప్పడానికి పరుగెత్తుకొచ్చాడు. జేబులో కానీలేదు, ముప్ఫై మైళ్లు నడిచాక ఒక లారీవాడు దయ దల్చి ఎక్కించుకున్నాడు. అమింజి కర్రిలో వదిలేశాడు. టాక్సీ ఒకటి పట్టి ఆఫీసు చేరుకున్నాడు. ముందు ఆఫీసులో కథ అవుతోందని, వెనుక మెట్లమీదుగా వెళ్ళి యోచనీయమ్మకి' చెప్పాడు. నీరసం వొచ్చి పడిపోయాడు. యోచనా దేవి రాగ వరసని మొదలెట్టింది.

"నా మావఃనేటి సేత్తారు దేవుడో" అంటూ – చౌదరి చిరాకుగా, కోపంగా కంగారుగా "అబ్బ ఊరుకో, కింద అందరూ వింటే బాగుండదు" అన్నాడు. యోచనాదేవి శృతి పెంచింది. నామావఃకేటయిపోయినాది. నాయనో..." అపుడు సుందరం అడ్డుపడ్డాడు.

"ఆదాదీతంగచ్చీ, నాన్‌దా ఉంటినే" అన్నాడు. సుందరం టెలిఫోన్ తీసి, ఒక అంకె తిప్పి – "హల్లో... ఆ... రెడ్డియార్ ఉండారా... రెడ్డి యార్ సార్ – నాన్‌దా, సుందరం... సరేసార్ – ఒక సహాయం కావాలి ఫోన్ పెట్టేసి, చౌదరి యోచనల నుద్దేశించి," మన తెలుంగువాండుదా పాండిచ్చేరీ సొంత ఊరు. పెద్ద బిజినెస్. మనం ఎంతసెప్తే అంతదా, రాంబిన్‌ప్లియన్స్. పోలీస్, గిలీస్, మేజిస్ట్రేట్ – అంతా ఆయనసేయలో ఉండారు. రండిమీ. చౌదరిగారు, కత పినిస్‌చేసి, రెడ్డియార్ వినిపోయి చూస్తును."

యోచనాదేవిని ఓదార్చడానికి సుబ్బులు మేడమీద ఉండిపోయినాడు చౌదరిగారూ, సుందరం కిందకి వెళ్లారు. విషశ్రీ కథ వినడానికి, ఎందుకంటే, యోచనాదేవికి ఏడుపొచ్చినా, కోపంవచ్చినా, ఆఖరికి అవధికి మించిన ఆనందం వొచ్చినా, చౌదరికి

కోప్పడ్డం తప్ప మరోరకమయిన ఉద్రేకం రాదు. అందువల్ల ఆయన పక్కనుండి తనను ఓదార్చాలని ఆమె ఎపుడూ అనుకోదు. ఆశించదు.

విషశ్రీ మూడోమారు తాంబూలంలో పొగాకు బిగించి క్రిందపచారు చేస్తున్నాడు. కథలో మరో కథ అడ్డుతగిలితే అతనికి చిరాకు. అంతేకాదు అయిదు నిమిషాల క్రితం చెప్పిన కథ మరిచిపోయి కొత్తకథలోకి అకస్మాత్తుగా అడుగుపెడతాడు. అందుకని అతనికి ప్రతి నాలుగు నిమిషాలకి జరిగిన కథ గుర్తుచేస్తుండాలి. ఆ అవకాశంలేక తిరిగి కథ మొదలుపెట్టినప్పుడన్నాడు.

"సరే - ఎన్.టి.ఆర్. విమానంనించి దూకీశాడు" - ఏడిసినట్టుంది అన్నాడు చౌదరి అసలే చిరాకుగా ఉండి, విషశ్రీ మహాఉద్రేకం మనిషి. అతని నోట్లో తాంబూలం, పొగాకు, కలిసిన ద్రావకం చౌదరి ముఖానికి రంగు వెయ్యకుండా సుందరం అడ్డుపడ్డాడు.

"అణ్ణా! కత అంతవరకైె రాలేదీ"- అని విషశ్రీ చెప్పిన కథని అతనికి తిరిగి జ్ఞాపకం చేశాడు. విషశ్రీ అందుకున్నాడు.

"ఇంజన్ చక్రం ఎన్.టి.ఆర్ మెడదాకా వచ్చేసింది. అయినా అతను లేవలా, ఇంజన్ డ్రైవరు దిగివచ్చాడు. ఎన్.టి.ఆర్.ని చూసాడు, "రామూ" అని అరిచాడు. అతన్ని గట్టిగా కౌగిలించుకున్నాడు. ఇంజన్ డ్రైవరు ఎవరో తెలుసా? రంగారావు వెయ్యాలనుకొండి ఆ వేషం. అతను ఎన్.టి.ఆర్. ఫాదరన్నమాట."

"అణ్ణా! వొణ్ణుటా - " అని అరిచాడు సుందరం - మెచ్చుకోలో, ఎత్తిపొడుపో అర్థంకాకండా.

"ఏడిసినట్టుంది, నాకేం నచ్చలా." అన్నాడు చౌదరి. "నచ్చలేదూ" అన్నాడు విషశ్రీ - నోట్లో ఎర్రటి ద్రావకాన్ని కూడగట్టుకుంటూ.

"చౌదరిసార్. ఆ తరువాత మంచి క్లైమాక్సుందాది," అని సర్దడానికి ప్రయత్నించాడు సుందరం.

ఆ క్లైమాక్సులో ప్రవేశించాడు చౌదరి మామగారు. గుడ్లురుముతూ చౌదరినీ, సుందరాన్నీ, విషశ్రీని పరీక్షగా చూశాడు. ఒక్క విషశ్రీయే, 'నీ చూపులకీ నీ బుర్రమీసాలకీ నే బెదురుతానా' అన్నట్టు నిర్లక్ష్యంగా తాంబూలం నములుతూ నిలబడ్డాడు. ఇంతలో రిక్షావాడు ఒక బెడ్డింగు తెచ్చి లోపలపెట్టి కూలికోసం నిలబడ్డాడు. ఆ తరువాత పట్టయ్య చౌదరికీ, రిక్షావాడికి రామరావణ యుద్ధం - వేరు వేరు భాషల్లో నడుస్తుంటే సుందరం కలగజేసుకొని, రిక్షావాణ్ణి, విషశ్రీని అవతలకి తీసుకపోయి, హాల్లో - మిజో తిరుగుబాటుకి జాగాచేసాడు.

"ఏందిరా, బస్సురూట్ల సొమ్ము కరారావుడేనా, ఏమన్నా మిగిలిసచ్చిందా," అని పరామర్శించాడు పట్టయ్య చౌదరి, రామకృష్ణ చౌదరి దానికి సమాధానం చెప్పలేదు.

"ఎవరో తలుపులో, కిటికీలో యిరోయిన్నంటగా?" అన్నాడు మావంచౌదరి.

"ఆవిణ్ణి అలా అవమానించావంటే మాటదక్కదు" అన్నాడు అల్లుడు చౌదరి.

"నోరు ముయ్యరా సవటా, నాలుగు డబ్బులు సేతికొచ్చేసేపాటికి బూవీఁ ఆకాసం కనపడదు కుర్రపీనుగులకి - వొయస్సులో మేవంతా ఏదో ఏడిసి నోళ్లమే, అయితే చినిమాల్లోకి దిగి అసలుకి మోసం వొచ్చే పని చెయ్యలే-"

అల్లుడు చౌదరి ముఖం చిట్లించీ మూతి బిగించి, తన అసమ్మతిని తెలియచేసాడు. మావ చౌదరి చుట్ట అంటించి, తను వచ్చిన పని వివరించాడు.

"అయిందేదో అయిపోయింది. ఇంకమకాం ఎత్తేసి, ఇంటికొచ్చెయ్యి మధ్యాన్నం రైలుంది."

"రాను" అన్నాడు చౌదరి.

"నెల్లూరులోనే ఏనాదోళ్లు శానామందున్నారు. మంచి పిట పిటలాడే వోళ్లు కావాలంటే నెలకోవంద పారేసి, పరిమనెంటుగానే పెట్టుకొనే వొద్దన్లేం ఇంటిపట్టుని పడుండు – అంతే".

"రాను" అన్నాడు అల్లుడు చౌదరి.

ఆ తరవాత అదమరుపుగా కుమారి యోచన మెట్లు దిగడం, వెనక సన్నాసి ఆమె నోదారుస్తూ అనుసరించడం – మావఁచౌదరి, 'బాగానేవుందే,' అని చుట్ట పొగ మధ్యనించి మెచ్చుకోడం, అల్లుడు చౌదరి 'పైకి పో' అని అరవడం కుమారి సన్నాసి చేతుల్లో మూర్ఛపోవడం – తరవాత మావాఁఅల్లుళ్ల మధ్య తగాదా శ్రుతిమించడం – అల్లుడు మావఁగార్ని అవతలకి గెంటి తలుపెయ్యడం, వగైరా జరిగాక, మధ్యాహ్నం రెడ్డియార్ కార్లో, సన్నాసిని విడిపించడానికి, రెడ్డియార్, సుందరం, కుమారి యోచనా, సుబ్బులు ఎక్కారు. ఇంక చోటులేక చౌదరి ఆగిపోవలసి వచ్చింది. చౌదరి తన కసినంతా సిగరెట్లమీద చూపించాడు. అంత ఇంటికీ అతనొక్కడు మిగిలాడు.

నాలుగురోజుల తరవాత, రెడ్డియార్ కార్లో సన్నాసితో సహా మిగతా అందరూ దిగారు. పాండిచేరినించి, కారు దిగుతుండగా కుమారి యోచనాదేవి, సంచుల్లా వాలిన రెడ్డియార్ బుగ్గల్ని ఆప్యాయంగా మీటడం చౌదరి కళ్లారా చూశాడు. ఆ తరవాత, అతి వేగంగా వొచ్చేశాయి పరిణామాలు.

పట్టయ్య చౌదరి అల్లుడుమీద దావావేసి, ఆస్తంతకీ, పిల్లల తరపున తనకూతుర్ని గార్డియన్‌గా పెట్టించాడు. ఈ దావాకీ, సన్నాసిమీద కేసు రద్దు చేయించడానికీ, చౌదరి దగ్గరున్న లోతక్కువ సొమ్ము కర్చైపోయింది. చౌదరికారులో కొన్ని ముఖ్యమైన సామానులూ, కారు మేజిస్ట్రేట్ కోర్టులో ఉండగా పోలీసులు తీసేసుకున్నారని వదంతి. మిగిలిన కారు ఒక ధర ఇచ్చి రెడ్డియార్ కొనేశాడు. వొచ్చిన డబ్బుల్లో సుందరం, తన కమీషన్ పోగా, మిగతాది తన జీతం క్రింద జమకట్టుకున్నాడు.

ఇహ. రెడ్డియార్ ప్రతిరాత్రి 7 గంటలనించి 9 గంటలవరకు ఆఫీసులోనే మకాం. ఆ తరవాత ఆఫీసునీ, మిగతా హంగుల్నీ, ఎవరెల్లా వాడుకున్నా ఆయనకేమీ అభ్యంతరంలేదు. నెలకి రెండువేలు కుమారి యోచన కిస్తాడు. అది ఎల్లా ఖర్చుపెట్టుకున్నా, అతనికి అభ్యంతరం లేదు. క్రమం క్రమంగా ఆఫీసుకీ – రెడ్డియార్ లేనపుడు – యజమాని ఎవరన్న విషయమై సన్నాసికి, చౌదరికీ, ప్రచ్ఛన్నయుద్ధం ప్రారంభమైంది. అది తీవ్రరూపం దాల్చకుండానే సన్నాసి తన ఆధిక్యం నిరూపించుకున్నాడు.

"పోనీ మీ ఊరెల్లిపోయెచ్చయండి బావగారు," అంది కుమారి యోచన ఎంతో జాలిపడుతూ.

"నా పెళ్లాంమీద అప్పీలుచేసి, ఆస్తి వశపర్చుకుని, పిక్చర్ తీసి పారియ్యాల, అప్పుడింటికెల్లాల," అన్నాడు చౌదరి. ఈలోగా రోజుకి రెండు రూపాయలు ఆయన కర్చుకిందా సద్దుతోంది. కుమారి యోచన.

రెడ్డియార్ మద్దతుతో పట్టుబడకుండా, పాండిచ్చేర్రీనించి గ్రేప్‌బుడ్ల దిగుమతి నిరాఘాటంగా సాగిస్తూ పెద్దవాడైపోయాడు సన్నాసి.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. కుమారి యోచనాకి, చౌదరంటే ఎంతో ఇది – అది జాలనండి, అభిమానమనండి, కృతజ్ఞత అనండి, ప్రేమనికూడా అనండి.

చౌదరి ఆ కథకోసం వెతుకుతూ పాండిబజార్లో తిరుగుతున్నాడు. సినీమా కథకోసం.

బ్రహ్మశ్రీ తదుపరి రాసిన జాబులో – "మిత్రమా కథకోసం అంతగా వెతకడం ఎందుకు? నీకథ అద్భుంగా ఉంటుంది – సినిమాకి, నామాట విని అది నిర్ణయించెయ్యి" అని రాశాడు. అయినా బ్రహ్మశ్రీమీద చౌదరికి కోపం రాలే – ఉక్రోషమో – ఆవేదనో, కంగారో, తెలీకుండా అది చదువుకుని పకపకా నవ్వుకున్నాడు.

యధాప్రకారం సుబ్బులుతో కలిసి పెసరట్లు తింటూ కథకోసం అన్వేషిస్తూ కాలం గడుపుతున్నాడు చౌదరి. కథ దొరకగానే తనే పెళ్లాందగ్గరకెళ్లి ఓరాత్రి ఖుషామత్ చేసి, కావలసిన సొమ్ము తేవచ్చుననీ, దాంతో పిక్చర్ తీసి తనజన్మ సఫలం చేసుకోవచ్చుననీ, ఆఖరుకి అంతా సుఖాంతం అవుతుందని అతని ఆశ.

అయితే కథ దొరకాలి ముందు – మంచి కథ.

(జయశ్రీ...)